# నల్లసూర్యుడికి 105 ఏళ్లు



అదొక సంస్థ మాత్రమే కాదు.. కోట్లాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే దివ్య జ్యోతి. లక్షలాది మంది కార్మికుల స్వేదానికి, శ్రమశక్తికి నిలువుటద్దం. తెలంగాణ గడ్డపై నల్ల బంగారాన్ని వెలికితీస్తూ దేశ పారిశ్రామిక రంగానికి ఊపిరి పోస్తున్న 'సింగరేణి' ప్రస్థానం ఒక అద్భుతం. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ.. 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా అవతరించి నేటితో (డిసెంబర్ 23) సరిగ్గా 105 వసంతాలు పూర్తి చేసుకుంటోంది.


WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

23-12-2025


# సాకులు.. సాగవు

## కలెక్టర్ అనుదీప్ అల్టిమేటం

- ఇకపై సాకులు చెబితే సాగనివ్వను సంక్రాంతి నాటికి 'ఇందిరమ్మ' ఇళ్లు పూర్తి కావాల్సిందే
- డాక్టర్ల డ్యూటీ ఎగ్గొడితే వేటు తప్పదు
- పాలనలో నిర్లక్ష్యం వహిస్తే ఇంటికే

**ఖమ్మం జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ సీరియస్ వార్నింగ్**

పంచాయతీ ఎన్నికల హడావుడి ముగిసింది.. ఇక సాకులు చెప్పే కాలం చెల్లిపోయింది! జిల్లా యంత్రాంగం మొత్తం తక్షణమే 'యాక్షన్ మోడ్'లోకి రావాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అత్యంత ఘాటుగా హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పాలన గాడి తప్పినా, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ తనదైన శైలిలో అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు.

**ఖమ్మం బ్యూరో, మహా**



జిల్లాలో పాలనా యంత్రాంగం నిద్ర వీడాలని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయని పక్షంలో కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు.

ముఖ్యంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి మన జిల్లా వారే ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలని స్పష్టం చేశారు.



## భారీగా గంజాయి పట్టుకున్న మణుగూరు పోలీసులు

**రూ.16.10 లక్షల విలువైన 33 కిలోల గంజాయి స్వాధీనం..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమీపంలోని తోగుగూడెం వద్ద సోమవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సుమారు రూ.16 లక్షల 10 వేల విలువైన 33 కిలోల నిషేధిత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



## ప్రజాభిష్టం మేరకు మంచి పాలన అందించాలి

**ఎమ్మెల్యే జారె**

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి నూతన పంచాయతీ సర్పంచ్ లు గా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ లను అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ దమ్మపేట మండల కేంద్రంలో సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన పగడాల రమాదేవి రాంబాబును ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

# ఈద్గా ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణ పనులకు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సోమవారం భూమి పూజ చేసి అధికారికంగా శ్రీకారం చుట్టారు. పట్టణ అభివృద్ధి దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు పట్టణ మౌలిక వసతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈద్గా పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నాణ్యతతో, వేగంగా, పారదర్శకంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, మణుగూరు పట్టణాన్ని భద్రతతో కూడిన అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే తమ కర్తవ్యమని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని కార్యరూపం దాల్చేలా నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ మధుకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, 14 టైర్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయితనబోయిన సతీష్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుకు అండగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట మన తెలంగాణ ఆర్సి ఇంచార్జ్ దొడ్డాకుల గిరిబాబు అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని ప్రెస్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల శెట్టి అప్పారావు ద్వారా తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే స్పందించారు. నిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే గిరిబాబును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య చికిత్సలు అందేలా పూర్తిస్థాయిలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే నిమ్స్ లో ప్రత్యేకంగా ఒక వైద్యుడిని ఏర్పాటు చేయించి, చికిత్సలు నిరంతరంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. ఇంకా మెరుగైన వైద్య పరీక్షలు, చికిత్సల కోసం హైదరాబాద్ లోని కిమ్స్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే చర్యలను మీడియా మిత్రులు అభినందిస్తున్నారు.




# ఆలయానికి ఎర్ర దిగ్బంధం

- దేవుడి దారికే రాజకీయ బేడీలు!
- ఖాకీల కళ్ల ముందే కమ్యూనిస్టుల 'ఫ్లెక్సీ'.
- ఆంజనేయుడి ముంగిట రాజకీయ అహంకారం!
- తీసేదే లేదంటూ హుకుం..
- భక్తుల మనోభావాలతో ఎర్రనేతల చెలగాటం!




**ఖమ్మం, మహా:** రాజకీయ ప్రచారం శృతి మించితే దైవ సన్నిధి సైతం తన ఉనికిని కోల్పోవాల్సిందేనా? ప్రజాస్వామ్యంలో నిరసనలకు, ప్రచారాలకు తావుంటుంది కానీ.. అది భక్తుల దారిని మూసివేసేలా ఉండటం ఇప్పుడు పెను వివాదానికి దారితీస్తోంది. ఖమ్మం నగరం నడిబొడ్డున, పోలీసుల నిఘా నేత్రాల కిందే ఒక చారిత్రక ఆలయ ద్వారానికి రాజకీయ ముసుగు వేసిన తీరు స్థానికులను ఉలిక్కిపడేలా చేస్తోంది. అడిగే నాథుడు లేక, అధికారులు పట్టించుకోక భక్తుల ఆవేదన అరణ్య రోదనగా మారుతోంది* ఖమ్మం జిల్లాలోని వరంగల్ క్రాస్ రోడ్ సెంటర్ రాజకీయ రణరంగాన్ని తలపిస్తోంది. ఇక్కడ కొలువై ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం పట్ల రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. తమ పార్టీ ఉత్సవాల ఆర్భాటంలో మునిగిపోయిన సిపిఐ నాయకులు, సామాన్య భక్తులు ఆలయంలోకి వెళ్లే పడమటి మార్గాన్ని ఏకంగా ఫ్లెక్సీలతో మూసివేశారు. భక్తుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ఆ భారీ ఫ్లెక్సీని చూస్తుంటే, అక్కడ ఉన్నది దేవాలయమా లేక రాజకీయ పార్టీ కార్యాలయమా అన్న అనుమానం కలుగుతోందని భక్తులు మండిపడుతున్నారు.ప్రతిరోజూ వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం వచ్చే ఈ పడమటి ద్వారాన్ని మూసివేయడంపై ఆలయ అర్చకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని పక్కకు జరపాలని వారు విన్నవించినప్పటికీ, సిపిఐ నాయకులు మాత్రం ససేమిరా అంటున్నారు. "ఈ నెల 26వ తేదీ వరకు మా సభలు ఉన్నాయి, అప్పటిదాకా ఈ ఫ్లెక్సీని ఇక్కడ నుంచి కదిలించే ప్రసక్తే లేదు" అంటూ హుకుం జారీ చేయడం వారి రాజకీయ అహంకారానికి పరాకాష్ట అని స్థానికులు ఆరోపిస్తున్నారు. దైవ ప్రార్థన కంటే రాజకీయ ప్రచారమే మిన్న అన్నట్లుగా వారి వ్యవహారశైలి ఉండటంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.అతిపెద్ద విడ్డూరం ఏమిటంటే, ఈ వివాదాస్పద ఫ్లెక్సీ ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ కు సరిగ్గా ఎదురుగానే ఉంది. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు, నిబంధనల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెట్టే అధికారులు.. ఇంతటి బహిరంగ ఉల్లంఘన జరుగుతున్నా కళ్లు మూసుకుని కూర్చోవడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓట్ల రాజకీయాల కోసమే అధికారులు మౌనం వహిస్తున్నారా? లేక రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర మత ప్రార్థనా మందిరాల ముందు ఇలాంటి చర్యలు జరిగితే స్పందించే తీరు వేరుగా ఉండేదని, కేవలం హిందూ దేవాలయాల విషయంలోనే ఈ వివక్ష ఎందుకని భక్తులు నిలదీస్తున్నారు.ప్రశ్నిస్తే దాడులు చేస్తారన్న భయంతో అణిగిమణిగి ఉండటం తమ వల్ల కాదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, సంబంధిత అధికారులు మరో 24 గంటల్లోగా స్పందించి ఆలయ మార్గాన్ని పునరుద్ధరించకపోతే, భక్తులే స్వయంగా రంగంలోకి దిగి ఆ ఫ్లెక్సీని తొలగిస్తామని స్పష్టం చేస్తున్నారు. రాజకీయాలు గోడలకే పరిమితం కావాలని, ఆలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజాభిష్టం మేరకు మంచి పాలన అందించాలి




**దమ్మపేట ,మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాదించి నూతన పంచాయతీ సర్పంచ్ లు గా సోమవారం పదవీ బాద్యతలు స్వీకరించిన సర్పంచ్ లను అశ్వారావుపేట శాసనసబ్యులు జారె ఆదినారాయణ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ దమ్మపేట మండల కేంద్రంలో సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన పగడాల రమాదేవి రాంబాబును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముందుగా పుష్పగుచ్ఛం అందించి ,సర్పంచ్ ,ఉపసర్పంచ్ ఆంగోత్ శ్రీనివాస్ లను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పార్టీ ప్రతినిధి గా ఒక వర్గం ప్రజలతోనే మమేకమై ఉన్న రమాదేవి ,నేడు అందరి ఆశీర్వాదం తో సర్పంచ్ గద్దెనెక్కరాని గుర్తు చేసుకోవాలన్నారు. కాబట్టి స్థానికంగా ఉన్న మౌలిక సమస్యలను ప్రజాభిష్టం మేరకు నెరవేర్చాలని ఎమ్మెల్యే జారె సూచించారు. అదేసమయంలో వార్డు సబ్యులు గా ఉన్న వారిని ఎప్పటికప్పుడు కో ఆర్డినేట్ చేసుకుంటూ దాదాపుగా 7000మంది ఓటర్లు ఉన్న మేజర్ పంచాయతీ లో సుభిక్షంగా పాలన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అత్తులూరి వెంకట రామారావు , కామవరపు విజయమారుతీ శర్మ ,చామర్తి గోపిశాస్రి ,చిన్నశెట్టి యుగంధర్ ,పెరుమాళ్ళ కృష్ణ ,శ్రీ రామ వెంకటరావు తదితరులు ఉన్నారు.

# గ్రామ పాలనకు కొత్త ఊపిరి

- మణుగూరులో 14 గ్రామ పంచాయతీలలో నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం..
- పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు ఎన్నికైన నూతన పాలకవర్గాలు సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టాయి. ఇందులో భాగంగా మణుగూరు మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ సమితి సింగారంలో నూతన సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్‌తో పాటు వార్డు సభ్యులతో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరూ ప్రజలకు జవాబుదారితనంతో, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.పంచాయతీ పరిధిలోని మౌలిక వసతుల సమస్యలపై ముందుగా అవగాహన పెంపొందించుకుని, సమస్యల ప్రాధాన్యతను గుర్తించి క్రమపద్ధతిలో పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారానికి పాలకవర్గ సభ్యులు తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని, నూతన పాలకవర్గాలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పాయం హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా నూతన సర్పంచ్ కలబోయిన మాధవరావు మాట్లాడుతూ.. తనను గెలిపించిన ఓటర్లకు, తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంధిసింగారం గ్రామ



పంచాయతీలోని సమస్యలపై తనకు అవగాహన ఉందని, ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిరినాకి నవీన్, శివ సైదులు, రహీం పాషా, పాతూరు వెంకన్న, కూచిపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచులకు ఎస్ కేటి గ్రూప్ డైరెక్టర్ శుభాకాంక్షలు..

**మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ నూతన సర్పంచిగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ కలబోయిన మాధవరావు ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లతోపాటు వార్డు సభ్యులకు ఎస్ కెటి గ్రూప్ యజమాని, దోసపాటి రంగారావు ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ ప్రజల ఆధారాభిమానాలను చురగొనాలని ఆకాంక్షిస్తూ పాలకవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.**

## కూనవరం పంచాయతీలో..

**మణుగూరు మండలంలోని మరో మేజర్ గ్రామ పంచాయతీ కూనవరంలో నూతన సర్పంచ్ గా ఏనిక శ్వేత తో పాటు పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తోపాటు మణుగూరు మండల పార్టీ శ్రేణులు హాజరయ్యారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.**





# బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ




**బోనకల్ మహా:** బోనకల్ మండలాన్ని బాల్యవివాహ రైతంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నందు బాల్యవివాహాల నిర్మూలనకై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి నలిని శ్రీ గారు అధ్యక్షత వహించడం జరిగిందిఈ సందర్భంగా ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహాలను 2030 కల్లా జిల్లాలో పూర్తిగా నిర్మూలించడానికి గత రెండున్నర సంవత్సరాలుగా సంబంధిత ప్రభుత్వ శాఖల సహకారంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు కేంద్ర ప్రభుత్వ బాల్ వివాహ ముక్త్ భారత్ లో భాగంగా వందరోజుల ప్రచార కార్యక్రమాన్ని ఇటీవల కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు శ్రీమతి అన్నపూర్ణాదేవి విజ్ఞాన్ భవన్ ఢిల్లీ నందు ప్రారంభించారని తెలిపారు . ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు జరుగుతుందని దానిలో భాగంగానే బోనకల్ మండల కేంద్రంలో బాల్య వివాహాలు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్ మాధవి లత,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతి రావు, అధ్యాపకులు జనార్ధన్ బాబు, రాజేంద్రకుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ ,రమేష్ ,ప్రియ కుమార్ రెడ్డి ,కృష్ణ ,యశోద అధ్యాపక సిబ్బంది మదార్ ,జస్వంత్ ,బుజ్జమ్మ ,అరుణ మరియు కేజీబీవీ స్పెషల్ అధికారిని సక్కుబాయి ఉపాధ్యాయునులుమరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల ప్రమాణ స్వీకారాలు







**అశ్వారావుపేట, మహా :** అశ్వారావుపేట మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకవర్గాలు అధికారికంగా బాధ్యతలు స్వీకరించాయి. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో పంచాయతీ కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించగా, నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలు ప్రజలకు సేవలందించేందుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. సర్పంచిగా విజయం సాధించిన పంచాయతీలకు సంబంధించి ఆయా రాజకీయ పార్టీల మండల స్థాయి నాయకులు, నియోజకవర్గ స్థాయి నాయకులు హాజరై నూతన సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

మహా పత్రిక
ANN తెలుగు

# వరసగా రెండవ సారి

- సర్పంచ్‌గా రెండవ సారి బాధ్యతలు చేపట్టిన మహారాణులు
- భర్త ఎంపీపీగా.. భార్య సర్పంచ్‌గా
- జడ్పీటీసీ రేసులో వారి భర్తలు..

**మారుమూల గ్రామీణ ప్రాంతం.. గిరిజన తండా వాసులు.. మండల కేంద్రానికి సుమారు 15కిలోమీటర్ల దూరంలో ఉన్న తండా వాసులు.. ఇద్దరు విద్యావంతులే.. మహారాణులు.. గత ఎన్నికల్లో సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన వారు.. మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మరో సారి విజయడంకా మోగించారు. దీంతో ఇద్దరు ఆయా పంచాయతీలకు వరసగా రెండవ సారి సర్పంచులుగా బాధ్యతలు చేపట్టారు. అంతే కాదు.. ఇద్దరి భర్తలు జడ్పీటీసీ రేసులో ఉన్నారు. వారెవ్వరు..? వారి వివరాలేంటో మహా పత్రిక అందించే కథనంలో చూద్దాం..**

**కూసుమంచి, మహా**

కూసుమంచి మండలంలో ఓ ఇద్దరు మహారాణులు వరసగా రెండవ సారి సర్పంచ్ లు గా బాధ్యతలు చేపట్టారు.. గత ఎన్నికల్లో సర్పంచ్ గా విజయం సాధించిన ఆ ఇద్దరు మహిళలు.. ఈ సారి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి రెండవ సారి బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయా పంచాయతీలలో వారు సర్పంచులుగా ప్రమాణస్వీకారం చేశారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్, టీడీపీ పార్టీ నుంచి సర్పంచ్ లుగా ఎన్నిక, ఆ తరువాత ఒకరు టీఆర్ఎస్ పార్టీలో చేరగా, మరోకరు టీఆర్ఎస్ కు మద్దతుగా కొనసాగారు. కాలక్రమేణా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఇద్దరు సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరి నేడు ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. దీంతో మండలంలోని ప్రజలు సర్వత్ర చర్చించుకుంటున్నారు.

## భర్త ఎంపీపీగా.. భార్య సర్పంచ్‌గా..?

కూసుమంచి మండలం గోరిలపాడుతండా కు చెందిన బానోతు శ్రీనివాస్ నాయక్ గత పాలకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీపీగా పనిచేశారు. అదే టైమ్ లో ఆమె భార్య బానోతు సరస్వతి పంచాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆ తరువాత ప్రస్తుతం ఆమె గోరిలపాడుతండా నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించింది. దీంతో వరసగా రెండవ సారి సర్పంచ్ గా సోమవారం బాధ్యతలు చేపట్టింది. బానోతు శ్రీనివాస్ ఇప్పటికే జడ్పీటీసీ రేసులో ఉన్నారు. ఆయనకు జడ్పీటీసీ టిక్కెట్ వస్తే ఇద్దరు భార్యభర్తలు వరసగా రెండు సార్లు ప్రజాప్రతినిధిగా కొనసాగే అవకాశం ఉంది.

## మారుమూల తండా నుంచి వరసగా రెండవ సారి

కూసుమంచి మండలంలోని అత్యంత మారుమూల తండా అయిన



**బానోతు సరస్వతి.. గోరిలపాడుతండా సర్పంచ్..**



**జర్పుల అనసూర్య, ఎర్రగడ్డతండా సర్పంచ్**

ఎర్రగడ్డతండాకు చెందిన జర్పుల శ్రీనివాస్ గతంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2019లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా, టీడీపీ అభ్యర్థిగా జర్పుల శ్రీనివాస్ సతిమణి జర్పుల అనసూర్య విజయం సాధించారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరగా, గత కొద్ది రోజుల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. దీంతో వరసగా రెండు పర్యాయాలు సర్పంచ్ గా విజయం సాధించగా, సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ భర్త శ్రీనివాస్ జడ్పీటీసీ రేసులో ఉన్నారు.



# రెవెన్యూ 'ఐక్యత'కు కలెక్టర్ ప్రశంస

**ఖమ్మం, మహా:** జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో చోటుచేసుకున్న ఏకగ్రీవ ఫలితాలు ఉద్యోగుల మధ్య ఉన్న బలమైన ఐక్యతకు, పరస్పర సమన్వయానికి నిదర్శనమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రశంసించారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా యూనిట్‌తో పాటు ఖమ్మం, కల్లూరు సబ్ డివిజన్‌లు, కలెక్టరేట్ యూనిట్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నూతన పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల పోటీ లేకుండా ఉద్యోగులందరూ ఏకాభిప్రాయంతో కార్యవర్గాన్ని ఎన్నుకోవడం రెవెన్యూ ఉద్యోగుల్లో ఉన్న అత్యున్నత స్థాయి ఐక్యతను స్పష్టంగా చాటుతోందన్నారు. ఇదే సమన్వయాన్ని విధుల్లోనూ కొనసాగిస్తూ జిల్లాలో రెవెన్యూ సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు. రెవెన్యూ అనేది కేవలం ఒక శాఖ మాత్రమే కాదు. ప్రభుత్వ పరిపాలన మొత్తం సజావుగా కొనసాగించబడేది రెవెన్యూ వ్యవస్థ ద్వారానే అన్నారు. ఇది ఎంతో ఒత్తిడితో కూడుకున్న వ్యవస్థ అని అలాంటి విభాగంలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉద్యోగులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కారుమంచి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, ట్రెజరర్ క్రాంతి కుమార్, గౌరవ అధ్యక్షులు రవీందర్, ముజాహిద్, సాయి నరేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు సీహెచ్. సురేష్, కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కల్లూరు డివిజన్ అధ్యక్షులు టి. కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి డి. కరుణశ్రీ, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు పి. రాజేష్, కార్యదర్శి బి. రవి, ఇతర సంఘ సభ్యులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొలువుతీరిన పాలకవర్గాలు







**నేలకొండపల్లి, మహా:** నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలవర్గాలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలం లోని 32 గ్రామ పంచాయతీలలో సర్పంచ్లు, వార్డు సభ్యులు ప్రమాణాస్వీకారం లో పాల్గొన్నారు. బోదులబండ లో జరిగిన గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణాస్వీకారంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పాల్గొన్నారు. సభ్యులతో ప్రమాణం చేయించారు. ఆయా పంచాయతీలలో స్పెషల్ ఆఫీసర్లు, పలు చోట్ల పంచాయతీ కార్యదర్శులు సభ్యులతో ప్రమాణాస్వీకారం చేయించారు. కోనాయిగూడెం పంచాయతీ ప్రమాణాస్వీకారం కు కాంగ్రెస్ కు చెందిన వార్డు సభ్యులు గైర్వజరయ్యారు. ఆయా గ్రామాలలో జరిగిన పంచాయతీ ప్రమాణాస్వీకారంలో సంబురాలు నిర్వహించారు. మంగాపురం లో కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేయించారు నలుగురు గైర్ హాజరయ్యారు.అనంతరం పంచాయతీ పాలకవర్గాల తొలి సమావేశం ను నిర్వహించారు.

# పాలకులు ఉంటేనే పరిపాలన బాగుంటుంది

**నేలకొండపల్లి, మహా:** పంచాయతీలకు పాలకులు ఉంటేనే బాగుంటుందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పి.ఆశాలత పేర్కొన్నారు. మండలం లోని బోదులబండ గ్రామ పంచాయతీ పాలకవర్గం తొలి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...జిల్లాలో ఒక్క పంచాయతీ మినహా 576 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. సోమవారం నుంచి కొత్త పాలకవర్గాలు పాలన ప్రారంభమవుతుందని అన్నారు. కొత్త పాలకవర్గాలు పంచాయతీ రాజ్ చట్టం ను అమలు చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నూతన సర్పంచ్ లు నిస్వార్ధంగా పని చేయాలని సూచించారు. సచివాలయం తరహాలోనే పాలన ఆదర్శంగా సాగాలని సూచించారు. ప్రతీ పని కి పంచాయతీ తీర్మానాలు తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే కాకుండా పన్నులు చాలా అవసరం అన్నారు. అందుకే జిల్లాలో పన్నుల వసూళ్ల కు ప్రత్యేక కార్యచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. పంచాయతీ లలో పని చేసే మల్టీఫర్పస్ వర్కర్స్ విషయంలో పాలకులు ఇష్టం లేని వారిని తొలిగించే చర్యలకు పాల్పడుతున్నారనే ప్రచారం ను ఖండించారు. అలాంటి ఏమీ ఉండవని...మల్టీఫర్పస్ వర్కర్స్ తో సమన్వయం చేసి పనులు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని నూతన పాలకవర్గాలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, సర్పంచ్ కట్టెకోల నాగార్జున్, ఉప సర్పంచ్ స్వాతి, వార్డు సభ్యులు చింతలపాటి భాస్కరరావు, మణెమ్మ, సర్వేష్, గండారపు ఉపేంద్రమ్మ, కట్టెకోల పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహా పత్రిక
ANN తెలుగు

# వామ్మో కొండచిలువ

**చెరుకు తోటలో కలకలం.. పరుగులు తీసిన కూలీలు**



**నేలకొండపల్లి,మహా:** చెరుకు నరుకుతున్న కూలీలకు ఒక్కసారిగా కొండ చిలువ కనిపించింది. దీంతో ఆందోళనతో కూలీలు పరుగులు తీశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మోటాపురం గ్రామంలో రామూర్తి అనే రైతు పొలంలో చెరుకు తోటలో సోమవారం ఉదయం ఏపీ కి చెందిన చెరుకు నరికేందుకు కూలీలు చెరుకు తోటలో కి వెళ్లారు. చెరుకు కొట్టేందుకు పని ప్రారంభించగానే...కొండ చిలువ ఒక్కసారిగా కదిలింది. దీంతో కూలీలు ఉలిక్కిపడ్డారు. భయంతో చెరుకు తోటలో పరుగులు తీశారు. కొద్దిసేపటికి కూలీలు మరి కొంత మంది గ్రామస్తులు ఘటనా స్థలం కు చేరుకుని కొండ చిలువ ను హతమార్చారు. దాదాపు 12 అడుగులు. 40 కిలోల బరువు ఉంది. . కూలీలు అప్రమతంగా ఉండటం వలన పెను ప్రమాదం తప్పిందని ఏపీ కి చెందిన కూలీలు పేర్కోన్నారు.

# నష్టాలను నివారించవచ్చు





**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపాడు మండల కేంద్రంలో సోమవారం విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందన కోసం విస్తృత స్థాయి మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యక్షంగా పాల్గొని, ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఈమ్ సి) ద్వారా అన్ని శాఖల చర్యలను పర్యవేక్షించారు.మాక్ డ్రిల్‌ను ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో, అబ్జర్వర్‌గా ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ సుఖేందర్ దత్ పర్యవేక్షణలో నిర్వహించబడింది. క్షేత్ర స్థాయిలో ఈ మాక్ డ్రిల్ బూర్గంపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలోని వరద ప్రభావిత ప్రాంతంలో జరిగింది. ఇందులో ప్రజలను సురక్షితంగా రక్షించడం, లైఫ్ జాకెట్లు, బోట్లు ఉపయోగించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించడం, అవసరమైన వైద్య సేవలు, త్రాగునీరు, భోజనం, తాత్కాలిక నివాసం వంటి సేవలను డెమో రూపంలో ప్రదర్శించడం జరిగింది. వివిధ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేవలను బాధితులకు అందించడం, ఫైర్, ఇరిగేషన్, గజ యితగాళ్ల పాత్రను, వారు చేపట్టే అత్యవసర చర్యలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించడం జరిగింది. పునరావాస కేంద్రాల్లో బాధితులకు త్రాగునీరు, భోజనం, అత్యవసర వైద్య సేవలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలను డెమో రూపంలో చూపించారు. అలాగే, బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించబడ్డాయి.

# సర్పంచ్ పీఠం ఆమెది... పరిపాలన ఎవరిది?

- మహిళా రిజర్వేషన్ల అసలు ఉద్దేశ్యం నెరవేరుతోందా?
- సర్పంచ్‌గా గెలిచినా నిజమైన నిర్ణయాధికారం ఎవరి చేతుల్లో ఉంటుంది?
- ఎన్నికల ఖర్చు పేరిట భర్తల ఆధిపత్యం న్యాయమేనా?
- పతి సంస్కృతిపై ప్రభుత్వ హెచ్చరికలు క్షేత్రస్థాయిలో అమలవుతాయా?
- పతి సంస్కృతి అంతమయ్యే బాధ్యత ఎవరిది?

**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం నూతన సర్పంచుల ప్రమాణస్వీకార కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రమాణస్వీకారం చేసిన సర్పంచ్‌లలో మహిళలు కూడా అధికంగా ఉండటం గర్వించ తగిన విషయం. మహిళా రిజర్వేషన్ల ద్వారా గ్రామ పాలనలో మహిళలకు రాజ్యాంగం ఇచ్చిన అవకాశానికి ఇది స్పష్టమైన నిదర్శనం. కానీ ఇదే సందర్భంలో ఒక కీలక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రాజ్యాంగం మహిళలకు కల్పించిన అధికారాన్ని వారు స్వయంగా వినియోగిస్తారా? లేక ఆ అధికారం పరోక్షంగా భర్తల చేతుల్లోకి వెళ్లిపోతుందా? గ్రామ పంచాయతీల్లో మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన తర్వాత, మహిళలు పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లుగా ఎన్నికవుతున్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక సానుకూల పరిణామం. అయితే ఈ విజయానికి వెంటనే మరో అసౌకర్యమైన ప్రశ్న ఎదురవుతోంది. మహిళ సర్పంచ్‌గా ఉన్న గ్రామాల్లో నిజమైన అధికారం ఎవరి చేతుల్లో ఉంది? అనేక గ్రామాల్లో సర్పంచ్ పీఠంపై మహిళ కనిపించినా, పాలనలో ముందుండేది మాత్రం వారి భర్తలేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారికంగా ప్రజలు ఎన్నుకున్నది మహిళలనే అయినా, నిర్ణయాలు తీసుకునేది భర్తలేనన్న భావన గ్రామాల్లో బలపడుతోంది. ఇదే పతి సంస్కృతిగా మారి, మహిళా సాధికారతకు అడ్డుగోడగా నిలుస్తోంది. ఎన్నికల సమయంలో ఖర్చంతా భర్తలే భరించారన్న కారణంతో, గెలిచిన తర్వాత అధికారం తమదేనన్న భావన కొందరిలో ఏర్పడుతోంది. ఫలితంగా గ్రామ పాలన ప్రజాస్వామ్య పద్ధతిని వదిలి, వ్యక్తిగత ప్రభావానికి లోనవుతోంది. ఇది గ్రామ స్వరాజ్య వ్యవస్థ ఆత్మకే విరుద్ధం. పోలీస్ స్టేషన్లు, మండల కార్యాలయాల చుట్టూ తిరగడం మహిళలకు ఇబ్బందిగా ఉంటుందన్న నెపంతో భర్తలు ముందుకు రావడం మొదట సహాయంగా కనిపించినా, అదే క్రమంగా అధికార నియంత్రణను వారి చేతుల్లోకి నెట్టేస్తోంది. బాధ్యత మహిళదైతే, నిర్ణయాధికారం కూడా ఆమెదే ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో పతి సంస్కృతిపై ప్రభుత్వాలు గట్టి వైఖరి తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్నాయి. అధికారిక సమావేశాలకు సర్పంచ్ బదులుగా భర్తలు హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరికలు వస్తున్నాయి. కానీ ఈ హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితమైతే, పరిస్థితిలో మార్పు రావడం కష్టమే. ఇక్కడ ప్రజల పాత్ర కూడా కీలకం. గ్రామ సమస్యలపై సర్పంచ్‌ను పక్కన పెట్టి ఆమె భర్తను సంప్రదిస్తే, పతి సంస్కృతి మరింత బలపడుతుంది. మహిళలను సర్పంచ్‌లుగా ఎన్నుకున్న ప్రజలే, వారికి అధికారాన్ని వినియోగించే అవకాశం కల్పించాలి. మహిళలు కేవలం పేరుకే సర్పంచ్‌లుగా కాకుండా, పాలనలో ముందుండి నిర్ణయాలు తీసుకున్నప్పుడే మహిళా రిజర్వేషన్ల అసలు ఉద్దేశ్యం నెరవేరుతుంది.



## చెక్ పవర్ ఎవరిది?

**సర్పంచ్‌గా సంతకం పెట్టే అధికారం మహిళలకే ఉంది. చట్టపరంగా బాధ్యత, జవాబుదారీతనం అన్నీ ఆమెవే. అప్పుడు పాలనపై నియంత్రణ కూడా ఆమె చేతుల్లోనే ఉండాలి. చెక్ పవర్ మహిళా సర్పంచ్‌ల దగ్గరే ఉన్నప్పుడు, నిర్ణయాలపై భర్తల ఆధిపత్యానికి తావు ఉండకూడదు.**

## మార్పు ఎక్కడ మొదలవ్వాలి?

**పతి సంస్కృతి అంతమవ్వాలంటే కేవలం ప్రభుత్వ హెచ్చరికలు సరిపోవు. అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. అంతకన్నా ముఖ్యంగా ప్రజలు మహిళా సర్పంచ్‌ను నేరుగా సంప్రదించే అలవాటు పెంచుకోవాలి. భర్తలు సహాయకులుగా ఉండొచ్చు. కానీ అధికార నిర్ణయాలు మాత్రం ప్రజలు ఎన్నుకున్న మహిళల చేతుల్లోనే ఉండాలి.**

# సంక్రాంతి నాటికి 'ఇందిరమ్మ' ఇళ్లు పూర్తి కావాల్సిందే



**ఖమ్మం బ్యూరో, మహా:** పంచాయతీ ఎన్నికల హడావుడి ముగిసింది.. ఇక సాకులు చెప్పే కాలం చెల్లిపోయింది! జిల్లా యంత్రాంగం మొత్తం తక్షణమే 'యాక్షన్ మోడ్'లోకి రావాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అత్యంత ఘాటుగా హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పాలన గాడి తప్పినా, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ తనదైన శైలిలో అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు*జిల్లాలో పాలనా యంత్రాంగం నిద్ర వీడాలని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయని పక్షంలో కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. ముఖ్యంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి మన జిల్లా వారే ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలని స్పష్టం చేశారు. సంక్రాంతి నాటికి వెయ్యి ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, ఇది విన్నపం కాదు.. ఆజ్ఞ అని అధికారులకు గుర్తు చేశారు. 6,700 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని, వాటిలో కనీసం 750 ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పండుగ లోపు లబ్ధిదారులకు అప్పగించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడబోనని డెడ్‌లైన్ విధించారు.

# కొలువుదీరిన కొత్త సర్పంచులు

- 41 పంచాయతీలలో ప్రమాణస్వీకారం చేసిన నూతన పాలకవర్గాలు
- హాజరైన దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి







**కూసుమంచి, మహా:** రెండేళ్ల తరువాత పంచాయతీలకు పాలక వర్గాలు ఏర్పడ్డాయి.. గత కొద్ది రోజుల క్రితం పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా, విజయం సాధించిన పాలకవర్గాలు సోమవారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. దీంతో అన్ని పంచాయతీల్లో సందడి నెలకొంది.. కొత్త పాలకవర్గాలు కొత్త ఉత్సహాంతో సందడి చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో కొత్త పాలకవర్గాలు పంచాయతీలలో కొలువుదీరనట్లైంది.. వారు మంగళవారం నుంచి పరిపాలన కొనసాగించనున్నారు.

## పంచాయతీలను అలంకరించిన పాలకవర్గం

పంచాయతీలలో నూతన పాలకవర్గాల ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో పండుగ వాతావరణం నెలకొంది. పంచాయతీ కార్యాలయాలను రంగులతో, లైటింగ్ తో, మామిడాకులు, కొబ్బరి ఆకులతో అలంకరించారు. పంచాయతీ కార్యాలయాల ఎదుట టెంట్లు వేసి స్వాగత ఏర్పాట్లు చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదుట పండుగ వాతావరణం నెలకొంది. పాలకవర్గాల ప్రమాణస్వీకారం అనంతరం టపాసులతో సందడి చేశారు. అనంతరం చాలా గ్రామ పంచాయతీల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## 41 పంచాయతీల్లో కొలువుదీరిన పాలకవర్గాలు

కూసుమంచి మండలంలోని 41 పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలు సోమవారం ప్రమాణస్వీకారం చేయడంతో కొలువుదీరాయి. మేజర్ పంచాయతీ కూసుమంచి, పాలేరు, నాయకన్ గూడెం, జీళ్ళచెరువు గ్రామాలతో పాటు మిగిలిన పంచాయతీలన్నింటిలో సర్పంచులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.



## నూతన పాలకవర్గాలకు దయాకర్ రెడ్డి శుభాకాంక్షలు

**కూసుమంచి మండలంలోని 41 పంచాయతీలలో నూతన పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేయగా, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత అనుచరుడు, ఖమ్మం క్యాంఫ్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కూసుమంచి క్యాంఫ్ కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచులకు, ఉపసర్పంచులకు, ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలిపారు. అందరు సర్పంచులతో పోన్లో మాట్లాడిన దయాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జీళ్ళచెరువు, కూసుమంచి, ధర్మతండా, గోరిలపాడుతండా పంచాయతీలలో జరిగే ప్రమాణస్వీకారం కార్యక్రమానికి దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి హాజరైయ్యారు. పాలక వర్గాలను అభినందించారు.**

## ప్రతి పంచాయతీ అభివద్ది బాధ్యత మంత్రిదే: దయాకర్

**రెడ్డిపాలేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీని అభివద్ది చేసే బాధ్యత రాష్ట్ర రెవెన్యూ, గహానిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిదేనని ఖమ్మం క్యాంఫ్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి హామినిచ్చారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న దయాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పాలకవర్గ సభ్యులందరు కలిసి సర్పంచ్, ఉపసర్పంచ్ తో కలిసి పని చేయాలని, పంచాయతీలకు రావాల్సిన నిధులకంటే ఎక్కువ ఇచ్చి అభివద్ది చేసే బాధ్యత మంత్రిదేనని హామినిచ్చారు. అందరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.**

# కొలువుదిరిన నూతన పాలకవర్గం

## కోయగూడెం సర్పంచ్ గా యువనేత సుభాష్ చంద్రబోస్



**టేకులపల్లి – మహా:** టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం కొలువుదిరింది సర్పంచ్ గా యువ కెరటం కోరం సుభాష్ చంద్రబోస్ ఉప సర్పంచ్ బావోజి తండా గ్రామానికి చెందిన అజ్మీర అనూష వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమా, సురేందర్ పంచాయతీ సెక్రెటరీ ఓకే వసంతరావు ఏ ఈ నవీన్ కుమార్, పంచాయతీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజే పాలన ప్రారంభం

## విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న సర్పంచ్ అశోక రాణి



**నేలకొండపల్లి, మహా:** మండలం లోని పలువురు నూతన సర్పంచ్ లు తొలి రోజే పాలన ను ప్రారంభించారు. సోమవారం నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాలన ను ప్రారంభించారు. మండలం లోని మంగాపురతండా పంచాయతీ సర్పంచ్ ధీరావత్ అశోక రాణి సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించి తొలి సంతకం అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్ధులతో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉంటుంది...టీచర్లు రెగ్యులర్ గా వస్తున్నారా లేదా అని విద్యార్ధులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మెరుగైన విద్య ను అందించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్ధుల సంఖ్య ను మరింత పెంచాలని సూచించారు. అదే విధంగా అజయ్ తండా లో సర్పంచ్ తేజావత్ శివాజీ నట్టల నివారణ కార్యక్రమం ను ప్రారంభించారు. అనంతరం వీధులలో పర్యటించి ప్రజలను సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పలువురు సర్పంచ్ లు పాలన ను తొలి రోజు నుంచే ప్రారంభించారు.

# ఫిబ్రవరిలో జరగబోయే ఫౌండేషన్ లిటరరీ సర్వేకి పిల్లలను సన్నద్ధం చేయాలి



**టేకులపల్లి – మహా:** టేకులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మూడు కాంప్లెక్స్ లు టేకులపల్లి, బోడు కుంటల కాంప్లెక్స్ లో జిల్లా ఏఎంఓ మానిటరింగ్ ఆఫీసర్ పాల్గొని మాట్లడుతూ... భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ఫిబ్రవరిలో నిర్వహించబోయే ఫౌండేషనల్ లిటరసీ సర్వే కొరకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజ శేఖర్ తెలిపారు. టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి మరియు టేకులపల్లి లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఆయన ఉపాధ్యాయుల ఉద్దేశించి మాట్లాడుతూ జూలైలో జరిగిన బేస్ లైన్ పరీక్ష నవంబర్లో జరిగిన మిడ్లైన్ పరీక్షల ఫలితాల ఆధారంగా కనీస సామర్థ్యాలు లేని పిల్లలను గుర్తించి వారిలో సామర్థ్యాల పెంపుదలే లక్ష్యంగా బోధనా అభ్యసన వ్యూహాలను ఏర్పరచుకోవాలని, తదనుగుణంగా వనరులను వినియోగించుకొని బోధనా అభ్యసన ప్రక్రియలను నిర్వహించాలని సూచించారు. అంతకుముందు విద్యార్థుల సామర్థ్యాలను మిడ్లైన్ పరీక్ష ఆధారంగా పాఠశాల వారీగా విశ్లేషించి, స్లో లెర్నర్స్ ను ఏ విధంగా అభివృద్ధి చేయాలో పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, కాంప్లెక్స్ సెక్రటరి బాణోత్ లక్ష్మా ఉపాధ్యాయులు మంగీలాల్, నరేష్, దేవదాసు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కృష్ణారెడ్డికి శాలువా కప్పి సత్కరించి అభినందించారు



**బూర్గంపహాడ్ మహా:** పార్టీ మనకేమిచ్చిందని కాదు మనం పార్టీకి ఏమిచ్చామని పార్టీ నుంచి ఏమి ఆశించకుండా సొంత ఖర్చులతో పార్టీని నడుపుకుంటూ..నిస్వార్థకంగా విశ్రాంతి తీసుకొని 30 ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్నా పార్టీ కోసం కష్టపడుతున్నా బాటసారి రాజకీ మేధావి...ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికలు మండల అధ్యక్షుడిగా నడిపిన తీరు బహుదా ప్రశంసనీయం... ఎవరైనా అతను రాజకీయ మేధావి తనకి హ్యాట్సాఫ్ కొట్టాల్సిందే మండలంలో 13 పంచాయతీలు 90 వార్డ్ నెంబర్లు గెలిచి రికార్డు సృష్టించిన మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి..రాజకీయ విశ్లేషకుడు.. అందరూ అభినం దించాల్సిందేనని చెంగలరావు అభినందించారు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి గారు చాలా ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటూ..ముందుకు వెళతాడు.. ఎన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురైనా.. ఎప్పటికీ వెనుక డుగు అనేదే వేయడు ఆయన ఆలోచన తర్వాత అందరికీ అర్థమవుతుంది అప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తాడు.

# జుజ్జులరావుపేట సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన దాట్ల సతీష్



**కూసుమంచి , మహా:** కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ మార్గం గంగాభవాని, పాలక వర్గ సభ్యులతో పంచాయతీ కార్యదర్శి ప్రమాణస్వీకారం చేయించారు. గ్రామ ప్రజలందరు పాల్గొని సర్పంచ్, ఉపసర్పంచ్, పాలక సభ్యులకు అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజలందరి సహాకారంతో పంచాయతీ అభివృద్ధి చేస్తానని సర్పంచ్ హామినిచ్చారు. కాంగ్రెస్ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి, కణతాల నాగయ్య, శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మందడి పద్మావెంకట్ రెడ్డి, బానోతు శ్రీనునాయక్, దాట్ల అనూష, జిల్లపల్లి ఉప్పయ్య, బానోతు శ్రీధర్, పడిశాల కొండలు, పడిశాల రాము పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో ప్రక్షాళన

- 15 రోజుల్లో మ్యాపింగ్ పూర్తి కావాల్సిందే!
- 2002 రికార్డులతో సరిపోల్చాలని ఆదేశం
- యుద్ధ ప్రాతిపదికన ఎస్.ఐ.ఆర్. ఓటర్ల జాబితా రూపకల్పన
- ప్రతి బూత్ స్థాయిలో డేటా వెరిఫికేషన్
- ఓటు హక్కులో పారదర్శకతే లక్ష్యం
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంచలన ఆదేశాలు

**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లాలో ఓటర్ల జాబితాను అత్యంత పకడ్బందీగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో పురోగతి ఉండాలని, ప్రిపరేటరీ కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని సీఈఓ సూచించిన నేపథ్యంలో కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ కీలక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలోని ఓటర్ల జాబితాను రెండు వర్గాలుగా విభజించాలని సూచించారు. 40 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు మరియు 40 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారి జాబితాలను విడివిడిగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 2002లో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ డేటాను ప్రామాణికంగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 2025 ఎస్.ఎస్.ఆర్. జాబితాలోని 40 ఏళ్ల పైబడిన ఓటర్ల వివరాలను, 2002 నాటి ఎస్.ఐ.ఆర్. జాబితాతో బూత్ స్థాయిలో మ్యాపింగ్ చేయాలని ఆయన ఆదేశించారు.ఈ భారీ ప్రక్రియను కేవలం 15 రోజుల్లోనే పూర్తి చేయాలని కలెక్టర్ గడువు విధించడం అధికారుల్లో అలజడి రేపింది. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 మరియు 2025 డేటాను క్షుణ్ణంగా సరిపోల్చి చూడాలని, అప్పుడే



అర్హులైన ఓటర్ల విషయంలో స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ డేటా మ్యాపింగ్ ద్వారా ఓటర్ల జాబితాలో ఉండే డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు , తప్పుడు వివరాలను తొలగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, డిప్యూటీ తహశీల్దార్ అన్సారి, ఇతర ముఖ్య అధికారులు పాల్గొని కలెక్టర్ నుంచి దిశానిర్దేశం పొందారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన క్యాలెండర్ కేసులు383, డ్రంక్ అండ్ డ్రైవ్3098, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు, ఈపెట్టి కేసులు 1117 తదితర కేసులు మొత్తం 4589 కేసులు పరిష్కృతం కాబడినయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. పోలీస్ అధికారులు కోర్టు సిబ్బంది గత వారం రోజుల నుండి కేసులలో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి రాజీమార్గం రాజ మార్గమని లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించినందున ఈ కేసులు పరిష్కరించబడినాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులను సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. లోక్ అదాలత్ ద్వారా ఇట్టి కేసుల పరిష్కారానికి ప్రతిభ చూపిన అధికారులు కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు తగిన రివార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో నమోదైన 71 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి, ఇట్టి కేసులలో నగదును కోల్పోయిన బాధితులకు 15,86,229 రూపాయల నగదును కోర్టు ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## ప్రజలకు అందించిన సేవలే శాశ్వతం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అందించిన సేవలు, చేసిన అభివృద్ధి శాశ్వతంగా నిలిచిపోతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలో విద్యానగర్ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన నూతన పాలకవర్గం ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలన్నారు. పేదలు బడుగు బలహీన వర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. మహిళలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు. గ్రామంలో సామాజిక సమతుల్యత ఐక్యతను కాపాడుకోవడం పాలకవర్గ బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పారిశుధ్యం తాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో పని చేస్తేనే ప్రజాప్రతినిధులకు శాశ్వత గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంలో పాలకవర్గం క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, సర్పంచి భూక్య శాంతి శ్రీ, ఉప సర్పచి వాసిరెడ్డి మురళి, నూతన వార్డు సభ్యులు, స్థానికులు అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ రాగా స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** శ్రీ రాగా స్కూల్‌లో సోమవారం జాతీయ మ్యాతమాటిక్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కరెస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్ ముందుగా గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు గణిత ప్రాధాన్యతను తెలియజేసే మోడల్స్, చార్ట్‌లు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజం ప్రపంచ గణిత మేధావుల్లో ఒకరని వీరు భారత దేశాన్ని గణితం ద్వారా ప్రపంచంలోనే అత్యున్నతంగా నిలిపారని అంటూ గణితం జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే ఎన్నో వినూత్న కార్య క్రమాలను స్కూల్ లో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం శ్రీ రాగా స్కూల్ డైరెక్టర్ మల్లారపు కవిత మాట్లాడుతూ రామానుజం గణిత శాస్త్ర పితామహుడు అంటూ వారు గణితంలో ఎన్నెన్నో అద్భుతాలు సృష్టించారని పేర్కొన్నారు. విద్యార్థులందరూ గణితంలో ఆసక్తి పెంచుకోవాలంటే వారి జీవిత చరిత్రను చదవాలని అన్నారు. అనంతరం యాజమాన్యం మ్యాథ్స్ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వేశ్వర రావు, రాంబాబు, మ్యాథ్స్ ఉపాధ్యాయులు భువన, కవిత, శ్రావణి, శోభా రాణి, రమేష్, మోహిత, సుష్మా, సుమా, అనూషా, అన్నపూర్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సిబ్బందికి క్రమశిక్షణ ముఖ్యం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కంపెనీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి క్రమశిక్షణ అనేది ముఖ్యమని ఏరియా సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. ట్రైనింగ్ సెంటర్లో సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజులపాటు జరుగు 38వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని అందులో భాగంగా ఎస్ అండ్ పిసి విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందని తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరుగుతుందని పేర్కొన్నారు. అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరుగుతుందని ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని పని ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించాలని మెరుగైన వృత్తి నైపుణ్యంతో క్రమశిక్షణతో నీతినిజాయితీతో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగుల పునః: నియామకానికి ఇంటర్వ్యూల నిర్వహణ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలుగా(జేఎంఈటీ) చేరి వివిధ కారణాలతో టర్మినేట్ అయిన జేఎంఈటి ఉద్యోగులను వారి విజ్ఞప్తి మేరకు తిరిగి విధుల్లోకి తీసుకోవటం కొరకు హైపర్ కమిటీ సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో నందు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూలను కమిటీ సభ్యులు జిఎం(సిపిపి)ఏ.మనోహర్, జిఎం(సేఫ్టీ) కే.సాయిబాబు, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జిఎం(హెచ్ఆర్‌డి) ఆర్.విజయ ప్రసాద్, జిఎం(ఎంఎస్)బొజ్జ రవి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ఛైర్మన్, డైరక్టర్(పా) ఆదేశాల మేరకు సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలుగా(జేఎంఈటీ) చేరి వివిధ కారణాలతో టర్మినేట్ అయి పునర్నియామకం కొరకు ధరఖాస్తు చేసుకున్న జేఎంఈటి ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. సింగరేణి సంస్థ నందు ఉద్యోగం పొందటం ఒక వరం లాంటిదని, బయట పోటీ ప్రపంచంలో ఉద్యోగం రాక చాలా మంది బాధపడుతున్నారని అలాంటిది సింగరేణి సంస్థ నందు ఉద్యోగం పొంది డిస్మిస్ కావటం చాలా బాధాకరం అని సింగరేణి సంస్థ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రోజు వారి విధులకు హాజరవుతూ ఉద్యోగాలను పోగొట్టుకోవద్దని ఏ ఏరియాలో ఉద్యోగం ఇచ్చినా వెళ్ళి సక్రమంగా డ్యూటీలను చేసుకొని వ్యక్తిగత అభివృద్ధితో పాటు కంపనీ అభివృద్ధికీ కూడా పాటుపడాలని కోరారు.

# భారీగా గంజాయి పట్టుకున్న మణుగూరు పోలీసులు

## రూ.16.10 లక్షల విలువైన 33 కిలోల గంజాయి స్వాధీనం

## ముగ్గురు నిందితులతో పాటు ఒక కారు స్వాధీనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమీపంలోని తోగుగూడెం వద్ద సోమవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సుమారు రూ.16 లక్షల 10 వేల విలువైన 33 కిలోల నిషేధిత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మణుగూరు సీఐ నాగబాబు సంఘటనకు సంబంధించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు డిసెంబర్ 22న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తోగుగూడెం సమీపంలోని సమ్మక్క–సారక్క దేవాలయం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సీలేరు నుంచి భద్రాచలం మార్గంగా వస్తున్న తెలుపు రంగు స్విఫ్ట్ డిజైర్ కారును ఆపి తనిఖీ చేయగా, కారులోని డిక్కీలో 24 ప్యాకెట్ల గంజాయి లభ్యమైంది. ఈ ఘటనలో మారుపాక యుగంధర్ అలియాస్ బాబు, మచ్చ క్రాంతి కుమార్, దుద్దుకుంట విజయభాస్కర్ రెడ్డి




అనే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సీలేరు సమీపంలోని చిత్రకొండ వద్ద సుంద్ర సుందర్ రావు అనే వ్యక్తి నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, స్టేషన్ ఘన్‌పూర్ ప్రాంతానికి తరలించి అధిక ధరకు విక్రయించాలనే ఉద్దేశంతో తీసుకెళ్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు గంజాయితో పాటు స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తల్లాడ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన చిన్నబ్బాయి



**తల్లాడ, మహా:** తల్లాడ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన పెరిక.నాగేశ్వర రావు (చిన్నబ్బాయి) ముందు గా నారాయణపురం గ్రామం లో రామాలయం లో పూజలు నిర్వహించిన సర్పంచ్ పెరిక నాగేశ్వరావు చిన్నబ్బాయి, పూజ అనంతరం ప్రమాణ స్వీకారం కి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ విజయోత్సవ ర్యాలీ కి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్య హాజరైనారు.నారాయణపురం నుంచి తల్లాడ వరకు అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తదనంతరం గ్రామపంచాయతీకి ప్రమాణ స్వీకరానికి సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్స్ అందరూ హాజరైనారు. తల్లాడ ఈవో కృష్ణారావు సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ నెంబర్లతో ప్రమాణ స్వీకారం చేపియటం జరిగింది.

## గ్లోబల్ రెయిన్‌బో స్కూల్ ఘనంగా జాతీయ గణిత దినోత్సవం




**కూసుమంచి, మహా:** జాతీయ గణిత దినోత్సవాన్ని మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో స్కూల్స్ , జేవీఆర్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి 'బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్ బై రీసెర్చ్' అవార్డును అందుకున్న గొప్ప వ్యక్తి, భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు. ఆధునిక గణిత శాస్త్రానికి పునాదులు వేసిన అసాధారణ మేధావి రామానుజన్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమయపాలన పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని దానికి అనుగుణంగా ప్రణాళికలను ఇప్పటినుంచే ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.

## కిలారు మనోహర్ ని సన్మానించిన డిసిసి అధ్యక్షులు నూతి



**చింతకాని,మహా:** మండల కేంద్రంలో ని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ. సోమవారం సాయంత్రం చింతకాని లోని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు నివాసంలో డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ మరియు మాజీ డీసీసీ అధ్యక్షులు పువాళ్ళ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మనోహర్ బాబు ని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎన్నికల సరళి గురించి అడిగి తెలుసుకున్నారు.మనోహర్ బాబు పాలక వర్గ సభ్యులను పరిచయం చేసుకొని వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు,కిలారు జగన్మోహనరావు,గాంధీనగర్ సర్పంచ్ వర్సు వీరభద్రం,కూరపాటి రాము వార్డు సభ్యులు వేముల కొండలరావు,కిలారు బాబూరావు,కోల ఉమారాణి, రహమతుల్లా, లక్ష్మణ్, షంషుద్దీన్, టీడీపీ జానిమియా,నాగరాజు,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితకుటుంబానికి చెక్కు అందజేసిన బ్యాంకు అధికారులు

**కూసుమంచి, డిసెంబర్ 22, మహా:** బ్యాంకు నుంచి లోన్ తీసుకుని, ఇన్సూరెన్స్ చెల్లించిన ఖాతాదారుని కుటుంబానికి బ్యాంకు అధికారులు సోమవారం రూ.25లక్షల బీమా చెక్కు అందించారు. వివరాల్లోకి వెళితే.. యూనియన్ బ్యాంకు పాలేరు శాఖ యందు పాలేరు గ్రామానికి చెందిన ఎడవెల్లి వీరభద్రారెడ్డి అనే ఖాతాదారుడు లోన్ తీసుకున్నారు. ఇటీవల కాలంలో ఆయన ప్రమాదవశాత్తు చనిపోవడం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారుడు 27 వేల రూపాయల చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవడం జరిగింది. ఆ ఇన్సూరెన్స్ కు సంబంధించి 25 లక్షల బీమాని వారి కుటుంబానికి యూనియన్ బ్యాంకు అనుబంధ సంస్థ అయిన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ 25 లక్షల రూపాయలు క్లైమ్ చెక్కుని యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ హనుమంతు రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రమేష్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ రీజినల్ మేనేజర్ శివ కుమార్ ఆధ్వర్యంలో ఖాతాకు నామినీగా ఉన్న వీరభద్రారెడ్డి భార్య ఎడవెల్లి వాణికి చెక్కు అందించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు బీమా చెల్లించి, కుటుంబానికి తగిన భరోసా ఇవ్వాలని సూచించారు.







## ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజునే ప్రజా సంక్షేమం వైపు అడుగులు వేసిన గోవిందాపురం ఏ కాంగ్రెస్ పార్టీ

**బోనకల్ మహా:** గోవిందాపురం ఏ గ్రామంలో గ్రామ సర్పంచిగా ఇస్రం కరుణ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ లబ్ధిదారులకు అందజేసినారు. గోవిందాపురం ఏ గ్రామంలో బొబ్బిళ్ళ చుక్కమ్మకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును సర్పంచి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. మొదటి రోజునే సంక్షేమ కార్యక్రమం చేయటం ప్రజలు ఆనందం వ్యక్తపరిచారు . లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎంపీ రఘురాం రెడ్డి కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డెబోయిన ఉపేంద్ర వార్డు నెంబర్లు గండమాల రాయప్ప వడ్డెబోయిన సతీష్ వినోద్ మిగిలిన వార్డు నెంబర్లు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు భాగం పాపారావు మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కావూరి జనార్దన్ రావు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం నాగేశ్వరరావు మొదలగు వారు పాల్గొన్నారు

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు..



**మణుగూరు, మహా :** మణుగూరు పట్టణంలోని ఎక్సలెంట్ హై స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడం, తార్కిక ఆలోచన శక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలు, విద్యార్థుల ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. గణితానికి సంబంధించిన ఆసక్తికర అంశాలపై చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్, ప్రిన్సిపాల్ యూసుఫ్ షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు యాకూబ్ షరీఫ్, సమీనా పాల్గొని విద్యార్థులను అభినందించారు. గణితంపై భయాన్ని తొలగించి, నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమవుతాయని వారు విద్యార్థులకు సూచించారు.కార్యక్రమం చివరగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, గణిత శాస్త్ర ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

## తొలి రోజే ప్రజలకు దాహం తీర్చిన సర్పంచ్



**కూసుమంచి, మహా:** సర్పంచ్ గా ప్రమాణస్వీకారం చేసి తొలి రోజు బాధ్యతలు చేపట్టిన సర్పంచ్.. ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామిని అమలు చేశారు. తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్న తండా వాసులకు దాహార్తి తీర్చేందుకు సోమవారం నూతన మోటార్ ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. కూసుమంచి మండలంలోని లాల్ సింగ్ తండా కు చెందిన సర్పంచ్ భూక్యా సావిత్రి కోటేశ్వరరావు సోమవారం సర్పంచ్ గా ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కూడా సర్పంచ్ తో పాటు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అయితే గ్రామంలో ప్రజలకు హామి ఇచ్చిన ప్రకారం తాగు నీటి అవసరాలకు మోటార్ ను ఏర్పాటు చేసి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సావిత్రి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో కచ్చితంగా అమలు చేస్తామని హామి ఇచ్చారు. తొలి రోజు మోటార్ ఆన్ చేసి నీళ్ళు విడుదల చేయడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ కు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా సారపాక పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంసారపాక మేజర్ గ్రామపంచాయతీ స్థానిక ఎన్నికల్లో గెలిచినటువంటి నూతన పాలకవర్గం యొక్క ప్రమాణ స్వీకారం ఘనంగా సారపాక పంచాయతీ నందు నిర్వహించారు ముందుగా సారపాక ఒకటవ వార్డు నుండి 18 వ వార్డు లో గెలిచిన వార్డు నెంబర్లకు ప్రమాణస్వీకారం చేయించిన బూర్గంపాడు ఎంపీడీవో జమాల్ రెడ్డి, అనంతరం మేజర్ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బి. రాహుల్, ఉప సర్పంచ్, కన్యధారి రమేష్, సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ యొక్క ప్రమాణ స్వీకారం చేయించారు ఈ కార్యక్రమానికి సారపాక మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సారపాక మేజర్ గ్రామపంచాయతీ మొదటి పాలకవర్గ సమావేశం సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటి పాలకవర్గ సమావేశంలో సారపాక లో ఉన్నటువంటి కీలకమైన సమస్యలపై ముందుగా మొదటి సమావేశంలో ఒకటో వార్డు నుండి 18 వ వార్డు లో ఉన్న సమస్యలపై చర్చించినట్లు తెలియజేసిన పాలకవర్గ సభ్యులు.

## షైన్ హై స్కూల్ లో ఘనంగా మాథ్స్ డే సెలెబ్రేషన్స్



**చింతకాని, మహా:** స్థానిక షైన్ హై స్కూల్ లో మాథ్స్ డే సంబరాలు చాలా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల మాథ్స్ ప్రాజెక్ట్స్ చేసి అందరిని అబ్బుర పర్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేసిన భాగం రాకేష్ మాట్లాడుతూ, పిల్లలు చేసిన ప్రాజెక్ట్ వర్క్స్ ని మెచ్చుకున్నారు. పిల్లల్ని ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగం సేవ ఫౌండేషన్ సభ్యులు రామి శెట్టి రవి, స్వర్ణాకర్,కరెస్పాండంట్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, గణితం భోదకులు నాగుల్ మీరా, శాంత, మల్లేశ్వరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇరవెండి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాబూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమనికి ముఖ్య అతిధిగా తల్లూరి పంచాక్షరయ్య, హాజరైనారు, నూతన సర్పంచ్ గుమ్మడి బాబురావు, ఉపసర్పంచ్ మహంకాళి రామరావు మరియు వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమనికి హాజరై నూతన పాలక వర్గం సభ్యులను ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన బూర్గంపహాడ్ మండల మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత , వారితో పాటు మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీ కృష్ణ,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజ ప్రతినిధులు, కార్యకర్తలు, మరియు గ్రామ పెద్దలు, మహిళలు యువకులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు..


# అంగరంగ వైభవంగా కిష్టారం సర్పంచ్ ప్రమాణ స్వీకారం

* ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారాలు
* ప్రమాణ స్వీకార కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత
* ఉప సర్పంచ్ పదవి బి.ఆర్.ఎస్ పార్టీకి ఇవ్వాలని ఆందోళన





**సత్తుపల్లి,మహా:** స్థానిక ఎన్నికలలో విజయ దంక మోగించిన సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీనిలో భాగంగా కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు తమ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం అట్టహాసంక నిర్వహించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గ్రామ సెక్రెటరీ ఎం.వి.రమణ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి, ఉప సర్పంచ్ శీలం నాగరాణి లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



### ప్రమాణ స్వీకార కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత..

కిష్టారం గ్రామ సర్పంచ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. కిష్టారం గ్రామపంచాయతీని ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేస్తే బి.ఆర్.ఎస్ పార్టీకి ఐదు వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ ఇచ్చే విధంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. హామీలో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు అత్యధిక మెజారిటీతో గెలిచే స్థానాలలో బి.ఆర్.ఎస్ పార్టీ సభ్యుల కోరిక మేరకు కాంగ్రెస్ వార్డు సభ్యులు తమ నామినేషన్లను ఉపసంహరిం చుకున్నారు. సర్పంచ్ పదవి ఏకగ్రీవానికి ఎదురుచూస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బి.ఆర్.ఎస్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చే విధంగా తమ పార్టీ నామమాత్రపు అభ్యర్థిని పోటీలో ఉంచి ఎన్నికలు జరిపేలా చేశారని కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఆరోపించారు. ఈ కారణంతో గ్రామ ప్రజల ఏకాభిప్రాయంతో బి.ఆర్.ఎస్ పార్టీకి ఉప సర్పంచ్ పదవి నిరాకరించి కాంగ్రెస్ పార్టీ 7వ వార్డులో ఏకగ్రీవంగా గెలుపొందిన బిసి కులానికి చెందిన శీలం నాగరాణి ని నియమించినట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

### ఉప సర్పంచ్ పదవి బిఆర్ఎస్ పార్టీకి ఇవ్వాలని ఆందోళన...

**ఉప సర్పంచ్ పదవి నిరాకరణ పై అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి ఆక్రోశించిన బి.ఆర్.ఎస్ కార్యకర్తలు ఉప సర్పంచ్ పదవి బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థికి ఇవ్వాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ప్రత్యర్థుల వాగ్వివాదంతో పరిస్థితి విషమించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నిరసనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింప చేశారు.**

# శ్యామలను సన్మానిస్తున్నఉద్యోగులు

## టిఎన్జీవోఎస్ ఈసీ మెంబర్‌గా శ్యామల

**కారేపల్లి, మహా :** టిఎన్జీవోఎస్ మెడికల్ ఫోరం ఈసీ మెంబర్ గా కారేపల్లి మండల పరిధిలోని గాంధీనగర్ సబ్ సెంటర్లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న శీలం శ్యామల ఎన్నికయ్యారు. ఖమ్మం నగరంలోని టీఎన్జీవోఎస్ ఫంక్షన్ హాల్లో మెడికల్ అండ్ హెల్త్ ఎంbల్లాయిస్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఇందులో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మా వంతుగా కృషి చేస్తామన్నారు. ఈసీ మెంబర్ గా ఎన్నికైన శ్యామలను వైద్యాధికారి ప్రబంధ, సూపర్వైజర్ సూర్యం, తోటి ఉద్యోగులు శాలువాతో సన్మానించారు.



# కొలువుతీరిన కొత్త సర్పంచ్‌లు

## పంచాయతీ అభివృద్ధే నా లక్ష్యం యువ నాయకుడు కిరణ్ నాయక్





**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలంలోని 41 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రజలు, గ్రామ పెద్దలు, అధికారుల సమక్షంలో సర్పంచులు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు సర్పంచ్, ఉపసర్పంచులతో పాటు వార్డు సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సర్పంచులు తమ కుర్చీలలో ఆసీనులై బాధ్యతలు స్వీకరించారు. గంగారం తండా గ్రామపంచాయతీ సర్పంచుగా యువ నాయకుడు నునావత్ కిరణ్ నాయక్ ను గ్రామస్తులు ఎన్నుకున్నారు . నునావత్ కిరణ్ నాయక్ తన పాలకవర్గ సభ్యులతో కలిసి అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిరణ్ నాయక్ మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి ఎన్నుకున్న గంగారం తండా పంచాయతీ ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపం చాయతీని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

## వైభవంగా రామానుజన్ జయంతి ఉత్సవాలు



**దమ్మపేట ,మహా :** ప్రపంచ గణిత మేధావుల లో ఒక రైన తెలుగుజాతికి చెందిన శ్రీనివాస్ రామానుజన్ జయంతి ఉత్సవాలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ జయంతి రోజును గణిత దినోత్సవంగా ఆనాటి ప్రభుత్వం ప్రకటించిన మేరకు దేశ వ్యాప్తంగా డిశంబర్ 23ను గణిత దినోత్సవంగా పరిగణిస్తూ ప్రతి విద్యాసంస్థల యందు విద్యార్థుల తో గణిత దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ పియంశ్రీ ఉన్నత పాఠశాల లో ప్రధాన ఉపాధ్యాయులు ఉషారాణి , గణిత ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల కు వివిద పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహకాలు అందించారు. మండలంలోని ఆశ్రమ పాఠశాలలు , ప్రైవేటు విద్యా సంస్థలు గీతాంజలి హైస్కూలు , బోటనీ బాలాజీ ఉన్నత పాఠశాల ,సెయింట్ మేరీస్ హైస్కూలు యందు విద్యార్థుల కు గణిత పోటీలు ,క్విజ్ ,క్రీడా పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థుల కు బహుమతులతో పాటు ప్రోత్సాహకాలు అందించారు.

## గంగారం తండా గ్రామపంచాయతీ అభివృద్ధి నా లక్ష్యం

### యువ సర్పంచ్ నునావత్ కిరణ్ నాయక్

**కారేపల్లి, మహా:** గంగారం తండా గ్రామపంచాయతీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని, పంచాయతీలోనే యువతతో మమేకమై పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని పంచాయతీ నూతన యువ సర్పంచ్ నూనవత్ కిరణ్ నాయక్ అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారుల సహకారంతోపాటు, పంచాయతీలోని యువత ప్రధానంగా ఆదర్శంగా తీసుకొని వారికి అనుకూలంగా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రధానంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింతగా పెంచి, నిరుద్యోగ యువతను ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు పంచాయితీ పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిరణ్ నాయక్ ను గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## నూతన పాలకవర్గాల కొలువుతీరిన వేళ

**బూర్గంపహాడ్ మహా:** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపొందిన పాలకవర్గాలు మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీలలో సోమవారం కొలువు తీరారు. అన్ని గ్రామపంచాయతీలలో పండగ వాతావరణం నెలకొంది. పాలకవర్గాల కుటుంబ సభ్యులతో గ్రామపంచాయతీలలో గెలుపొందిన అభ్యర్థులకు మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులు కార్యకర్తలతో ఆయా గ్రామపంచాయతీలలో సందడి వాతావరణం నెలకొంది. ముందుగా సర్పంచ్ గా ఎన్నికైన నూతన సర్పంచులు గ్రామ అధికారుల చే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఉప సర్పంచులుగా ఎన్నికైన వారిని ప్రమాణ స్వీకారం చేయించారు. చివరిగా వార్డు సభ్యులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరిని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులు తమ గ్రామ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రజల సమస్యలను పట్ల తక్షణమే స్పందిస్తూ మంచి ప్రజాప్రతినిధిగా నిలుస్తామని తెలియజేశారు. గ్రామపంచాయతీలలో మద్దతిచ్చిన పార్టీల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి పూల బొకేలు అందించు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసిన భద్రాచలం డివిజన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కమిటీ



**భద్రాచలం, మహా:** భద్రాచలం డివిజన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి.యు నాగలక్ష్మిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీ కి ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను డిఇఓ తో చర్చించారు. డిఈఓ నాగలక్ష్మి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు ప్రసాద్ బాబు ముఖ్య సలహాదారు పలివెల రవికుమార్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి ఎస్.వి కిషోర్ ట్రెజరర్ స్థానికొమ్ము చైతన్య రెడ్డి, ఉపాధ్యక్షులు బి ఎన్ ఆర్, ఆశిక్ లైక్, కార్యవర్గ సభ్యులు సురేష్ గోడపర్తి రాంబాబు , రమేష్ కోటిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల ప్రమాణ స్వీకారం



**పినపాక, మహా:** పినపాక మండలం 23 గ్రామపంచాయతీలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా గెలుపొందిన అభ్యర్థులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయా గ్రామ ప్రత్యేక అధికారులు నూతనంగా ఎన్నికైన సర్పంచులచే, పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం సర్పంచ్ లకు గ్రామ ప్రత్యేక అధికారులు బాధ్యతలు అప్పగించారు.ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామ ప్రత్యేక అధికారులు శాలువాతో సర్పంచ్ తో పాటు పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తామని, గ్రామస్తుల సహకారంతో అన్ని రంగాల్లో ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారులు ఎంపీడీవో సంకీర్త్, తహసీల్దార్ గోపాల కృష్ణ, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు ,మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామ సర్పంచ్‌గా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన ప్రభు



**చింతకాని మహా:** మండలపరిధిలోని తిమ్మినేనిపాలెంగ్రామ నూతన సర్పంచ్ గా కొమ్ము ప్రభు పదవీ ప్రమాణం స్వీకారం చేసి పదవిబాధ్యతలు స్వీకరించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి శశికళ నూతన సర్పంచ్ ప్రభు, ఉపసర్పంచ్ బుచ్చిబాబు మరియు వార్డు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ బాధ్యతను,తన కర్తవ్యాలను అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని ఆయన అన్నారు.సోమవారం నిర్వహించిన తొలిసమావేశంలో గ్రామంలో పెండింగ్ పనులపై దృష్టి సారించి త్వరలో పూర్తిచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పాలన అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని,ప్రజలకు జవాబుదారీగా ఉంటామని స్పష్టం చేశారు. సర్పంచ్ ను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు హనుమంతరావు, మీరాసాహెబ్, బాబుఆదిలక్ష్మీ, మమత గ్రామ పెద్దలు దమ్మాలపాటి జగన్మోహన్ రావు, బి ఆర్ యస్ నాయకులు పోటు నాగేశ్వరరావు,నాదెండ్ల వెంకటేష్,ఆశా కార్యకర్తలు లక్ష్మీ,మంజుల, అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, పంచాయతీ కార్మికులు యాకూబ్, యేసోబు తదితరులు పాల్గొన్నారు.

# నల్లసూర్యుడికి 105 ఏళ్లు

- గోదావరి గర్భంలో మరో శతాబ్దం వెలుగులు!
- అక్షయ పాత్ర.. సింగరేణి జైత్రయాత్ర
- పాతాళంలో 21 వేల మిలియన్ టన్నుల సిరులు
- కృష్ణవర్ణ పసిడి గని.. సాంకేతికతతో కొత్త మలుపు
- రెండో తల్లికి పునర్జన్మ.. బెల్లంపల్లిలో మళ్లీ సిరుల ప్రవాహం!
- ఇది బొగ్గు కాదు.. జాతి సంపద
- 130 ఏళ్ల చరిత్రలో సరికొత్త అధ్యాయం
- భూగర్భ సామ్రాజ్యంలో 'బ్లాక్ గోల్డ్' వేట
- సింగరేణి ప్రస్థానంలో చెరగని రికార్డులు
- నేటితో సరిగ్గా 105 వసంతాలు పూర్తి



**ఖమ్మం బ్యూరో, మహా:** అదొక సంస్థ మాత్రమే కాదు.. కోట్లాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే దివ్య జ్యోతి. లక్షలాది మంది కార్మికుల స్వేదానికి, శ్రమశక్తికి నిలువుటద్దం. తెలంగాణ గడ్డపై నల్ల బంగారాన్ని వెలికితీస్తూ దేశ పారిశ్రామిక రంగానికి ఊపిరి పోస్తున్న 'సింగరేణి' ప్రస్థానం ఒక అద్భుతం. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ.. 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా అవతరించి నేటితో (డిసెంబర్ 23) సరిగ్గా 105 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. బ్రిటిష్ శాస్త్రవేత్త విలియం కింగ్ పరిశోధనలతో మొదలైన ఈ మహా ప్రస్థానం.. నేడు ఆస్ట్రేలియా సాంకేతికతతో పాతాళంలోకి చొచ్చుకుపోతోంది. గోదావరి లోయ గర్భంలో దాగి ఉన్న దాదాపు 21,464 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికితీస్తూ.. మరో వందేళ్ల పాటు ఉత్పత్తికి ఢోకా లేదని, వెలుగులకు లోటు లేదని సగర్వంగా చాటిచెబుతోంది. ఈ చారిత్రక సందర్భంలో సింగరేణి గడిచిన మైలురాళ్లు, భవిష్యత్తు అన్వేషణలు, పాతాళంలో దాగి ఉన్న సంపదపై 'మహా పత్రిక ' ప్రత్యేక కథనం.సింగరేణి చరిత్ర పుటలను తిరగేస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. 1870లోనే బ్రిటిష్ శాస్త్రవేత్త విలియం కింగ్ చేసిన పరిశోధనలే ఈ మహా వృక్షానికి బీజం వేశాయి. ఆ పరిశోధనల ఫలితంగా 1886లో ఇల్లెందులో తొలిసారిగా తవ్వకాలు మొదలుకాగా 1889లో పూర్తిస్థాయి వాణిజ్యపరమైన బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. కాలక్రమంలో విస్తరిస్తూ 1920 డిసెంబర్ 23న ఈ సంస్థకు 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా నామకరణం చేశారు. నాటి నుంచి నేటి వరకు 105 ఏళ్లుగా అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఈ సంస్థ 1928లో బెల్లంపల్లి, 1937లో కొత్తగూడెం, 1961లో రామగుండం ప్రాంతాలకు విస్తరించి ప్రస్తుతం 18 ఓపెన్‌కాస్ట్, 22 భూగర్భ గనులతో వెలుగులు పంచుతోంది.

## అన్వేషణలో అత్యాధునిక సాంకేతిక విప్లవం

కాలం మారుతున్న కొద్దీ సింగరేణి తన రూపురేఖలను మార్చుకుంటోంది. ఒకప్పుడు బొగ్గును వెలికితీయడం అసాధ్యం అనుకున్న చోట ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో అద్భుతాలు సృష్టిస్తోంది. ముఖ్యంగా 600 నుంచి 1500 మీటర్ల లోతులో ఉన్న క్లిష్టమైన బొగ్గు పొరలను వెలికితీసేందుకు 'భూగర్భ బొగ్గు వాయుకీకరణ' (అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్), 'కోల్‌బెడ్ మీథేన్' వంటి వినూత్న పద్ధతులను అమలు చేస్తోంది. దీనికోసం ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ సంస్థ 'సీఎస్ఐఆర్వో'తో చేతులు కలిపింది. రామగుండంలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో ఈ సాంకేతికతను ఉపయోగించి జియో టెక్నికల్, హైడ్రో జియోలాజికల్ పరీక్షలు, 30 పెర్మియబిలిటీ పరీక్షలు నిర్వహించి విజయవంతం కావడం దేశ బొగ్గు చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది.

## అంచనాలకు మించిన నిల్వలు.. జిల్లాల వారీగా లెక్కలివే!

సింగరేణి అన్వేషణ విభాగం జరిపిన సర్వేలో గోదావరి లోయ గర్భంలో ఊహించని స్థాయిలో బొగ్గు నిక్షేపాలు బయటపడ్డాయి. మొత్తం 21,464 మిలియన్ టన్నుల నిల్వలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆరో స్థానంలో నిలిచింది. జిల్లా వారీగా పరిశీలిస్తే.. మంచిర్యాల జిల్లా అత్యధికంగా 3,305.11 మిలియన్ టన్నులతో అగ్రస్థానంలో నిలవగా.. భద్రాద్రి కొత్తగూడెం 2,801.26 మిలియన్ టన్నులతో రెండో స్థానంలో ఉంది. పెద్దపల్లిలో 1,894.02, భూపాలపల్లిలో 1,717.77, ఆసిఫాబాద్‌లో 623.63, ఖమ్మం జిల్లాలో 504.76 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉన్నట్లు తేలింది.

## బెల్లంపల్లికి పూర్వవైభవం

**ఉత్తర తెలంగాణలో సింగరేణి విస్తరణకు నాంది పలికి.. 'రెండో తల్లి'గా కార్మికులు పిలుచుకునే బెల్లంపల్లి ప్రాంతం ఒక దశలో కనుమరుగవుతుందనే ఆందోళన వ్యక్తమైంది. అయితే తాజా పరిశోధనలు ఆ ప్రాంతానికి మళ్లీ జీవం పోశాయి. బెల్లంపల్లి షాఫ్ట్ బ్లాక్-1 నుంచి 4 వరకు జరిపిన అన్వేషణలో భారీ నిల్వలు బయటపడ్డాయి. ముఖ్యంగా 1997 నుంచి 2010 మధ్య జరిపిన సర్వేల్లో బ్లాక్-1లో 63.88, బ్లాక్-2లో 80.45, బ్లాక్-3లో 85.67, బ్లాక్-4లో 75 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారించారు. నెన్నెల మండలం శ్రావణపల్లిలో, గోలేటి మెగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతం మళ్లీ సిరుల మాగాణిగా మారబోతోంది. గోలేటిలో 1,358 హెక్టార్ల విస్తీర్ణంలో 39 మిలియన్ టన్నుల బొగ్గు ఉండటం.. మూసివేసిన గనుల్లోనూ ఇంకా బొగ్గు మిగిలి ఉండటంతో అక్కడ కొత్త ప్రాజెక్టులకు మార్గం సుగమమైంది.**

## శాస్త్రీయ అన్వేషణ.. బయ్యారం బాధ్యత

**భూమి లోపల దాగి ఉన్న సంపదను గుర్తించేందుకు సింగరేణి అత్యంత శాస్త్రీయ పద్ధతులను పాటిస్తోంది. కిలోమీటర్‌కు ఒక బోరు చొప్పున వేసి.. ఆ తర్వాత ప్రతి 400 మీటర్లకు ఒక బోరు వేస్తూ గరిష్టంగా 800 మీటర్ల లోతు వరకు రంధ్రాలు చేస్తోంది. దీనివల్ల బొగ్గు నాణ్యత, మందం, లోతుపై స్పష్టమైన అవగాహన వస్తోంది. సింగరేణి సామర్థ్యంపై నమ్మకంతోనే ప్రభుత్వం బయ్యారం ఇనుము ఖనిజ అన్వేషణ బాధ్యతలను కూడా ఈ సంస్థకే అప్పగించింది. కేవలం బొగ్గు వెలికితీయడమే కాకుండా భూగర్భ జలాల అధ్యయనం, జియో ఇంజనీరింగ్, జియోలాజికల్ మోడలింగ్ వంటి క్లిష్టమైన అంశాల్లోనూ సింగరేణి తనదైన ముద్ర వేస్తోంది. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థ.. ఆధునిక సాంకేతికతను జోడించుకుని మరో వందేళ్ల ప్రస్థానానికి సిద్ధమైంది. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి పాత్ర అనిర్వచనీయం.**

మహా పత్రిక
ANN తెలుగు

# తనికెళ్లలో కొలువుదీరిన నూతన పాలకవర్గం

* సర్పంచ్‌గా గడల కళావతి ప్రమాణ స్వీకారం
* రాజకీయాలకు అతీతంగా గ్రామ వికాసం
* ఐక్యతను చాటిన తనికెళ్ల పంచాయతీ నూతన సభ్యులు



**.కొణిజర్ల, మహా:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకవర్గం సోమవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించింది. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వేదికగా, స్పెషల్ ఆఫీసర్ మరియు మండల విద్యాధికారి అబ్రహం పర్యవేక్షణలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అధికారులు నూతన సభ్యులచేత నియమనిష్టలతో ప్రమాణం చేయించారు. గ్రామ నూతన సర్పంచ్‌గా గడల కళావతి, ఉప సర్పంచ్‌గా చెల్లా నరసింహారావు దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు వార్డు సభ్యులుగా ఎన్నికైన బత్తుల నరసింహారావు, డేరంగుల వెంకట లక్ష్మీ, షేక్ మైబుబీ, బాషా వెంకటేశ్వర్లు, బానోతు రామయ్య, పొట్లపల్లి సుధ శ్రీ, ఇరుమళ్ళ సుజాత, కోర్లకంటి గోపి శంకర్, బెజవాడ రాంబాబు, లేడిబోయిన సైదారావు, యాస జ్యోతి, తుప్పతి రవి, పుప్పాల స్వాతి తమ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం,టిడిపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో బిజెపి మండల అధ్యక్షులు కవిడ మురళి మాజీ సర్పంచులు గడల సీతారామయ్య, చల్లా మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పొట్లపల్లి గోపి, గడల నరేంద్ర నాయుడు, సిపిఎం నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు పివి రావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే రంజాన్, విశ్రాంత ఉపాధ్యాయులు లేని గోపాలరావు ప్రసంగించారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీలు జెండాలను పక్కనపెట్టి 'గ్రామ ఐక్యత గ్రామాభివృద్ధి' అనే నినాదంతో ఒక కూటమిగా ఏర్పడి ఈ విజయాన్ని సాధించామని వారు గర్వంగా ప్రకటించారు. రాజకీయ వైవిధ్యం ఉన్నప్పటికీ, గ్రామాభివృద్ధి విషయంలో అందరూ ఏకతాటిపైకి రావడం విశేషమని వారు కొనియాడారు.పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సర్పంచ్ గడల కళావతి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే తమ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. వార్డు సభ్యులందరి సహకారంతో, గ్రామస్తుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ తనికెళ్ల గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రవికుమార్, పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు అందజేశారు.









# కొత్త యాకన్న అనే నేను...

## అగపేటసర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కొత్త యాకన్న

**దంతాలపల్లి, మాహా:** గ్రామ పంచాయతీలో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తానని నూతన సర్పంచుగా బాధ్యతలు స్వీకరించిన కొత్త యాకన్న అన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు.నూతన సర్పంచ్, పాలక వర్గ సభ్యులకు పలువురు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి అధికారులు, గ్రామ ప్రజలు, యువత,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

